క్లుప్తంగా

ఐటీడీఏ పీఓ బదిలీని రద్దు చేయాలి

ఏటూరునాగారం: ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ అంకిత్ బదిలీని రద్దు చేయాలని ఐలాపురం కొమురం భీం యూత్ ప్రధాన కార్యదర్శి ఆలం నగేష్ కోరారు. మంగళవారం మండలం ఐలాపురం గ్రామంలో యూత్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఓగా అన్ని విధాలా అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కానీ అకారణంగా బదిలీ చేయడం సమంజసం కాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని జాతరలకు నిధులు ఇవ్వాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్హర్: మండలంలోని రుద్రారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు నేడు(బుధవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్ ఏఈ సంపత్‌యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సంతాపం

ఎస్ఎస్ తాడ్వాయి: సమ్మక్క పూజారి సిద్ధబోయిన దశరథం మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో ఈఓ రాజేంద్రం, జాతర కమిటీ చైర్మన్ ఆరెం లచ్చుపటేల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మాజీ సర్పంచులు ఇర్ప సునీల్‌దొర, చిడం బాబురావు, తుడుందెబ్బ సంఘాల నేతలు ఉన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు



చిట్యాల: మండలంలోని మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సెకండ్ ఎస్సై ఎండీ.శాఖాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లారీల్లో పర్మిట్ లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేసినట్లు తెలిపారు. అలాగే నవాబుపేట గ్రామ శివారులో గల చలివాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బైక్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు



కాటారం: మండల కేంద్రానికి సమీపంలో కాటారం–మంథని ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీ కొట్టిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహాముత్తారం మండలం పెగడపల్లికి చెందిన రామగిరి కిష్టయ్య, రమేశ్ కాటారంలోని బంధువుల ఇంటికి వెళ్లి ద్విచక్ర వాహనంపై గారెపల్లి వైపు వస్తున్నారు. ఈ క్రమంలో మంథని వైపు నుంచి వస్తున్న భూపాలపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనక నుండి బలంగా ఢీ కొట్టింది. బైక్ బస్సు కిందికి దూసుకుపోగా కిష్టయ్య ఎగిరిపడటంతో తీవ్ర గాయాలపాలయ్యారు. రమేశ్‌కు స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

ఎంపీడీఓకు సన్మానం

శాయంపేట : ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ఫణిచంద్రను మంగళవారం స్థానిక ఎంపీటీసీలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం సీఐ రంజిత్‌రావును ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఎంపీటీసీలు మేకల శ్రీనివాస్, అజ్మీరా ఉమారఘుసింగ్, ఎంపీఓ రంజిత్‌కుమార్ ఉన్నారు.

సీపీ నిర్ణయం హర్షణీయం

ఆత్మకూరు : బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి హింసించిన ఆత్మకూరు ఎస్సై ప్రసాద్‌ను సస్పెండ్ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవడం హర్షనీయమని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సైను సస్పెండ్ చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. కాగా బుధవారం నిర్వహించతలపెట్టిన ధర్నాను విరమిస్తున్నట్లు ఈ సందర్భంగా ధర్మారెడ్డి తెలిపారు.

అడ్డురాని అంగవైకల్యం

- క్రీడల్లో రాణిస్తున్న సాధ రఘు
- అంతర్జాతీయ స్థాయిలో పతకాల పంట



రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలో ప్రథమ బహుమతి తీసుకుంటున్న రఘు(ఫైల్)

టేకుమట్ల: అకుంఠిత దీక్ష, పట్టుదల ముందు అంగవైకల్యం అడ్డుకాదని నిరూపించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పథకాల పంటను పండించిన వ్యక్తి సాధ రఘు. మండలంలోని అంకుషాపూర్‌లోని సాద రాజయ్య–ఓదమ్మల ప్రథమ కుమారుడైన రఘు పుట్టుకతో ఒక్కో చేతికి రెండు వేళ్లతో ఉన్నా, ఉన్నత విద్యను అభ్యసించి తనలోని క్రీడా ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. 2007 నుంచి మొదలైన క్రీడా ప్రవేశం అనంతరం ఎక్కడా వెనుదిరిగి చూసిన సందర్భాలు లేవు. కుటుంబ భారం, ఆర్థిక ఇబ్బందులతో సైతం సహవాసం చేస్తూ లక్ష్యం వైపు పరుగెడుతున్నాడు. 2007లో జిల్లా స్థాయి షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం, బ్యాట్మింటన్‌లో జాతీయ స్థాయిలో సింగిల్స్‌లో బ్రాంజి మెడల్, డబుల్స్‌లో సిల్వర్ మెడల్, 2009లో 11వ జాతీయ అథ్లెటిక్స్‌లో ప్రవేశం, పారా ఒలంపిక్ సౌత్‌జోన్ సిల్వర్ మెడల్ పొందాడు. అలాగే 2013లో జాతీయ బ్యాట్మింటల్‌లో బ్రాంజి మెడల్, బిహార్‌లో 2014లో తెలంగాణ నుంచి ఫుట్‌బాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 2017లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానం, 2018 వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో గోల్డ్‌మెడల్, కర్ణాటకలో జరిగిన జాతీయ స్థాయి కబడ్డీలో స్థానం సంపాధించాడు. 2019 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రాష్ట్రస్థాయి షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం, 2020రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో డిస్కస్‌త్రోలో గోల్డ్‌మెడల్, షాట్‌పుట్‌లో సిల్వర్‌మెడల్. బ్యాట్మింటన్‌లో గోల్డ్‌మెడల్, 2021లో జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో డిస్కస్‌త్రోలో గోల్డ్‌మెడల్, షాట్‌పుట్‌లో సిల్వర్‌మెడల్ సాధించాడు. 2021 కర్ణాటకలో నిర్వహించిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొన్నారు. రఘు జాతీయ స్థాయిలో పథకాలను సాధించినప్పటికీ ప్రస్తుతం సాధారణ జీవితాన్ని గడుపుతున్నాడు.

ప్రోత్సాహం అందిస్తే ముందుకు..



ఆర్థిక ఇబ్బందులతో మరిన్ని అథ్లెటిక్స్‌లో పాల్గొదుకు ఇబ్బందిగా ఉండడంతో వెళ్లలేక పోతున్నా. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందిస్తే మరింత ముందుకు వెళ్లా. ఉపాధిహామీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసి కుటుంబాన్ని పోసిస్తూ అథ్లెటిక్స్‌పై ఉన్న ఇష్టంతో పాల్గొన్నా. నాలాంటి వైకల్యం గల వారికి ప్రభుత్వం నుంచి సాయం అందిస్తే ఆర్థికంగా తోడుంటుంది.

– సాధ రఘు, అథ్లెటిక్ క్రీడాకారుడు, అంకుషాపూర్

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నమ్రత, కిరణ్

మంగపేట: పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ నమ్రత దేవులపల్లి సూచించారు. మంగపేట, వాజేడు మండంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు మానసిక ఒత్తిడి నిర్వాహణ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ పోరిక కిరణ్, డాక్టర్ నమ్రత మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యాయామం మెడిటేషన్ చేయడం వలన ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. నేను సాధించగలను అనే ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన టెలీ మానస్ 14416 నంబర్‌కు విద్యార్థులు కాల్ చేసి ఏసమయంలోనైనా తగు సూచనలు సలహాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘పల్స్‌పోలియో’ను విజయవంతం చేయాలి



ఏఎన్ఎంలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

మహాముత్తారం: మార్చి 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి సందీప్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యసిబ్బందికి పల్స్‌పోలియోపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మార్చి 3 నుంచి 5వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మమత, జ్యోతి, రాజకుమారి, పావని, సీహెచ్ఓ విద్యాసాగర్, హెచ్‌వీలు హేమలత, రమాదేవి, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శబరిమాత, దమ్మక్కల పేరుతో ప్రకటించాలి



మాట్లాడుతున్న ప్రచారకులు రాములుస్వామి

భూపాలపల్లి అర్బన్: శ్రీరామచంద్రుడిని వెలుగులోకి తీసుకువచ్చిన శబరిమాత, దమ్మక్కల పేరు మీద జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు ప్రదానం చేయాలని సనాతన ధర్మ ప్రచారకులు అఖిల భారత హనుమాను, శ్రీరామ ప్రచారకులు గాదెపాక రాములుస్వామి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తండ్రి మాట కోసం 14 సంవత్సరాలు అరణ్యవాసంలో భాగంగా మాతంగా మహర్షి ఆశ్రమంలో చేరిన అనంతరం శబరిమాతకు దర్శనమించి శబరి ఆతిథ్యం స్వీకరించి ఆమెకు మోక్షాన్ని ప్రసాదించినట్లు తెలిపారు. పోకల దమ్మక అనే గిరిజన మహిళ భద్రగిరి కొండపై ఉన్న రామచంద్రుడిని వెలుగులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో సంబురాలు



పాలాభిషేకం చేస్తున్న యాదవసంఘం నాయకులు

కాటారం: కాంగ్రెస్ పార్టీకి చెందిన మాదండి అనిల్ కుమార్ యాదవ్ రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికవడంపై హర్షం వ్యక్తం చేస్తూ అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో సంబురాలు నిర్వహించారు. సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబతో కూడిన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన అనిల్‌కుమార్‌యాదవ్‌ను రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు గడ్డం చంద్రయ్య, బోయిని రాజయ్యయాదవ్, గడ్డి మల్లేశ్‌యాదవ్, అబ్బినవేన ఐలయ్యయాదవ్, మొగిలి రాజ్‌కుమార్‌యాదవ్, లచ్చయ్య, రాజ్‌కుమార్, తొట్ల శ్రీశైలం, ఓదేలు, రాజేందర్, ప్రతాప్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్పయాత్రకు తరలిరావాలి



మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

పరకాల : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు తెలిపేందుకు చేపటుతున్న ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ఈనెల 29న పరకాలలో కార్నర్ మీటింగ్ నిర్వహించడం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి తెలిపారు. విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రపంచంలోనే భారతదేశం అగ్ర భాగంలో నిలువాలంటే ప్రధాని నరేంద్ర మోదితోనే సాధ్యమవుతుందన్నారు. ఎన్నడూలేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్క కార్యకర్త, ప్రజలపై ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం రామాలయం నుంచి వరంగల్ భద్రకాళి దేవాలయం వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. అనంతరం పరకాల పట్టణంలో జరిగే కార్నర్ సమావేశంలో కిషన్‌రెడ్డి ప్రసంగిస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు, సత్యనారాయణరావు, దేవునూరి మేఘనాథ్, మంద అయిలయ్య, అసెంబ్లీ కన్వీనర్ ములుక ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్‌లాల్, కార్యదర్శి రామన్న, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, పట్టణ ప్రధాన కార్యదర్శులు నిరంజన్, విజయ్, కౌన్సిలర్ భద్రయ్య, పూర్ణచారి, రూరల్ అధ్యక్షుడు రవీందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారం తగ్గించడమే ధ్యేయం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రమేశ్, సిబ్బంది

నర్సంపేట : సామాన్యులకు విద్యుత్ భారం తగ్గించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని అమలు చేస్తోందని స్థానిక పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు. ఆ పథకం వాల్‌పోస్టర్లను స్థానిక పోస్టాఫీస్‌లో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు సహజ వనరుల వినియోగాన్ని విస్తరించి సామాన్యులపై విద్యుత్ చార్జీల భారం తగ్గించేలా కేంద్ర ప్రభుత్వం పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. గృహ అవసరాలకు సంబంధించి నెలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన ప్రజలు ఇళ్లపై సోలార్ ప్లేట్స్‌ని అమర్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.78 వేల వరకు సబ్సిడీ ఇవ్వనుందని చెప్పారు. వివరాల కోసం పోస్టల్ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన ప్రజలు వివరాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సబ్ పోస్ట్‌మాస్టర్ దార్ల రాజేందర్, పోస్టల్ అసిస్టెంట్ రాజన్, మెయిన్ ఓవర్సర్స్ అశోక్, వీరభద్రయ్య, ఎంటీఎస్ సురేశ్, సంపత్‌కుమార్, అనూష, శ్రీకాంత్, కృష్ణకిశోర్, నాగేందర్, రాజేందర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్యులు



తీమోపాస్ మందు చల్లుతున్న సిబ్బంది

వాజేడు: ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వాజేడు వైద్యులు మహేందర్, గ్నానస అన్నారు. మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో మంగళవారం జ్వరాలపై ఇంటింటా సర్వే నిర్వహించారు. గ్రామంలో 42 మందిని పరీక్షించగా అందులో 15 మందికి జ్వర లక్షణాలు కనిపించడంతో ఆర్‌డీటీ కోసం రక్త నమూనాలను సేకరించారు. 12 మందికి సాధారణ జ్వరం కాగా ముగ్గురికి తీవ్ర జ్వరం ఉండటంతో వారిని వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం నిమిత్తం పంపించారు. గ్రామంలో బాలింతలు, గర్భిణులను పరీక్షించి మందులను అందజేశారు. గ్రామంలోని పరిసరాలను పరిశీలించి తీమోపాస్ మందును దోమల లార్వాను అరికట్టడం కోసం గుంతల్లో చల్లారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో కోటిరెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రాలను అందజేస్తున్న భాస్కర్

శాయంపేట : తెలంగాణ రైతురక్షణ సమితి మండల అధ్యక్షుడిగా మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన అసాల బాపురావును, ప్రధాన కార్యదర్శిగా గోవిందాపూర్ గ్రామానికి చెందిన ఐరబోయిన తిరుపతిని నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ మంగళవారం వెల్లడించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికేల కిషన్‌రావు, జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్‌కు ఇరువురు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల రక్షణకు తనవంతుగా సమితి సూచించిన మార్గంలో నడుచుకొని న్యాయం చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చౌళ్ల రామరావు, బాపురావు, హింగే రవీందర్ పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు రెన్యూవల్ చేసుకోవాలి

ఆత్మకూరు : రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని ఆత్మకూరు పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆత్మకూరు డీసీసీ బ్యాంకు పరిధిలోని సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో భాగంగా 2 లక్షల పైగా రుణాలు పొందిన రైతులు వడ్డీలు చెల్లిస్తే రుణమాఫీకి అర్హులు అయ్యే అవకాశం ఉందన్నారు. రైతులు సత్వరమే చెల్లించి తమ రుణాలను రెన్యువల్ చేసుకోవాలని కోరారు. అధ్యక్షులు, కార్యదర్శులు రైతుల వద్ద నుంచి రుణాలు వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నోడల్ ఆఫీసర్ హరిత, బ్యాంక్ మేనేజర్ శ్వేత, సూపర్ వైజర్ రాజేష్, శాయంపేట చైర్మన్ శరత్‌బాబు, సంఘం కార్యదర్శులు ఓం ప్రకాశ్, రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం



వాజేడు: హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

వాజేడు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటి (బుధవారం) నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు సిబ్బంది సర్వం సిద్ధం చేశారు. మొదటి సంవత్సరంలో జనరల్ విభాగంలో 93 మంది ఒకేషనల్ కోర్సులో 102 మంది ద్వితీయ సంవత్సరంలో జనరల్ విభాగంలో 94 మంది ఒకేషనల్ కోర్సులో 31 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. కాగా కళాశాలలో ఇప్పటికే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, సిబ్బందికి సూచనలు చేశారు. పరీక్షలు జరుగుతున్న కళాశాల నుంచి 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ విధించామని అది అమలులో ఉంటుందని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష సమయం ఉన్నందున సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయనున్నట్లు, అందుకు స్థానికులు సహకరించాలని సూచించారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

మంగపేట: మండల కేంద్రంలోని ఎక్కటి సరోజిని శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటి (బుధవారం) నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు నిర్వవహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం 114 మంది విద్యార్థులు, ద్వీతీయ సంవత్సరం పరీక్షలు 123 మంది విద్యార్థులు రాయనునట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులు ఉదయం 8 గంటల వరకు కళాశాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

గోవిందరావుపేట: గోవిందరావుపేట జూనియర్ కాలేజీలో నేటి (బుధవారం) నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ జలకర్ర వెంకన్న మంగళవారం తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షకు 202 మంది, రెండో సంవత్సరం పరీక్షకు 229 విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు.


విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయంపాలన దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహారించి పాఠాలు బోధించారు. డీఈఓగా ఆలూరి సాయిగణేశ్, డిప్యూటీ డిఈఓగా జక్కుల అభినయ్, ఎంఈఓగా బైరి రామ్‌చరణ్, ప్రధానోపాధ్యాయురాలుగా మంద రోహిణి వ్యవహరించగా 20మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాసర్ల చంద్రమౌళి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులే సమాజానికి దిక్సూచి అన్నారు. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని కోరారు.

పాఠశాలకు బెంచీల బహూకరణ



బెంచీలు పంపిణీ చేసిన ఆర్‌డీటీ సంస్థ ప్రతినిధులు

భూపాలపల్లి రూరల్: మండలంలోని ఆముదాలపల్లిలోని ప్రాథమిక పాఠశాలకు ఆర్‌డీటీఎల్ ఐసీ హెచ్‌ఎఫ్ఎల్ సంస్థ వారు డెస్క్ బెంచీలతో పాటు టేబుళ్లు పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో కొంత మంది రైతులకు తుంపర సేద్యం కోసం స్ప్రింక్లర్లు అందజేశారు. గ్రామంలోని మహిళా సంఘాల అభివృద్ధికి సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులకు గ్రామస్తులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు వారికి తెలిపారు.